క్లుప్తంగా

పట్టణ ఎస్ఐగా శ్రీనివాస్

గద్వాల క్రైం: పట్టణ ఎస్ఐగా కె శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడారు. సమస్యలపై వచ్చే బాధితులు నిర్భయంగా ఫిర్యాదులు చేయవచ్చన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటి వరకు నమోదైన పెండింగ్ కేసుల విచారణ చేపట్టి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేసి నిందితులకు శిక్షపడేలా కృషి చేస్తామన్నారు. దొంగతనలు, ప్రమాదాలు, సైబర్ నేరాలు, చీటింగ్ తదితర కేసుల విషయంలో ప్రత్యేక నిఘా పెట్టి కట్టడి చేస్తామన్నారు. సాధారణ బదిలీలో భాగంగా గద్వాల ఇక్కడికి వచ్చామన్నారు. ప్రస్తుత ఎస్ఐ శ్రీకాంత్ జిల్లా కార్యాలయంలో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశాలు జారీ అయ్యాయి.

ఎంపీడీఓ సేవలు మరువలేనివి

రాజోళి: ఎంపీడీఓగా నాలుగేళ్లు గోవిందు రావ్ అందించిన సేవలు మరువలేనివని జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు నిషాక్, చేనేత శ్రామిక సేవా సమితి సభ్యులు వీరేష్ అన్నారు. సోమవారం నారాయణపేట జిల్లాకు బదిలీపై వెళ్తున్న ఎంపీడీఓను శాలువా, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. రాజోళిలో సర్పంచులతో పాటు చేనేత కార్మికులకు ఆయన అందుబాటులో ఉండేవారని, నాలుగేళ్లుగా అన్ని గ్రామాల అభివృద్ధికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో పెద్ద ఖాజా, రమేష్, బాబురావ్, రంగస్వామి చేనేత కార్మికులు పాల్గొన్నారు.

శివాలయంలో పూజలు

ఉండవెల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లోని శివాలయాల్లో శివ లింగానికి అభిషేకాలు నిర్వహించారు. మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలోని శివ లింగానికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వాములు శరణుగోషా, అష్టోత్తరాలతో భజనలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు ఆంజనేయ శర్మ, ఆలయ ధర్మకర్త దామోదర్ రెడ్డి, శివ స్వాములు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శివునికి ప్రత్యేక అభిషేకం చేశారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు బీచుపల్లికి చేరుకొని శివాలయాన్ని దర్శించుకున్నారు. ధ్వజస్తంభం ముందు కొబ్బరికాయలు కొట్టి శివునికి అభిషేకాలు నిర్వహించి మొక్కులను తీర్చుకున్నారు.

మొక్కల పెంపకంపై దృష్టి సారించాలి

మల్దకల్: ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలలో మొక్కల పెంపకంపై నర్సరీ నిర్వాహకులు దృష్టి సారించాలని ఎంపీఓ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి సూచించారు. సోమవారం బూడిదపాడు, అమరవాయి, బిజ్వారం గ్రామ సమీపంలో ఉన్న ఉపాధి హామీ నర్సరీలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యం మేరకు నర్సరీలలో మొక్కలను పెంచి వాటిని సంరక్షించాలని పేర్కొన్నారు. టెక్నికల్ అసిస్టెంటు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు సరస్వతి విద్యార్థిని ఎంపిక

శాంతినగర్: సైన్స్ డే పురస్కరించుకుని జిల్లా స్థాయిలో సోమవారం నిర్వహించిన పోటీల్లో వడ్డేపల్లి మున్సిపాలిటీ శాంతినగర్ సరస్వతి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థిని రాష్ట్రస్థాయిలో మూడో స్థానం కైవసం చేసుకుంది. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో గద్వాలలో ఏర్పాటు చేసిన చిత్రలేఖనం పోటీల్లో సరస్వతి విద్యానికేతన్ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని సి.వైష్ణవి రాష్ట్రస్థాయిలో మూడో స్థానంలో నిలిచి ప్రతిభ చాటారు. ఈనెల 7న నిర్వహించిన మండల స్థాయి పోటీల్లో విద్యార్థిని ప్రథమ స్థానంలో నిలిచింది. దీంతో జిల్లా స్థాయికి పంపగా రాష్ట్ర స్థాయిలో మూడో స్థానం కైవసం చేసుకోవడంతో పాఠశాల కరస్పాండెంట్ రవి, మమత, ఉపాధ్యాయులు అభినందించారు.

నేటి నుంచి గుండ్ల భీమ రాయస్వామి ఉత్సవాలు

అయిజ: మండలంలోని తొత్తినోనిదొడ్డిలో మంగళవారం నుంచి గుండ్ల భీమరాయస్వామి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి పల్లకీసేవ నిర్వహించనున్నారు. రాత్రి ప్రభోత్సవం నిర్వహించనున్నారు. 14న రాత్రి రథోత్స వం నిర్వహించనున్నారు. 15న ఓపెన్ కబ డ్డీ పోటీలు, సందరాళ్ల ఎత్తు పోటీలు, దొబ్బుడు గుండ్లు ఎత్తు పోటీలు, గుబ్బల గుండ్లు ఎత్తు పోటీలు, ఇసుక సంచి ఎత్తు పోటీలు, ట్రాక్టర్ రివర్స్ డ్రైవింగ్ పోటీలు నిర్వహించనున్నారు. అదేవిధంగా 16న పొటేళ్ల పోటీలు, 17న బండలాగు పోటీలు నిర్వహించనున్నారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తికి గాయాలు

మానవపాడు: జాతీయ రహదారిపై బైక్‌పై వెళ్తున్న వ్యక్తి అదుపు తప్పి తీవ్రగాయాలైన ఘటన మండల కేంద్రంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ చంద్రకాంత్ కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ పట్టణానికి చెందిన అమర్‌ప్రసాద్ కర్నూల్ నుంచి హైదరాబాద్ వెళ్తుండగా, జల్లాపురం శివారు ప్రాంతంలో బైక్ అదుపు తప్పికింద పడ్డాడు. దీంతో తీవ్ర గాయాలు కావడంతో వెంటనే స్థానికులు హైవే అంబులెన్స్‌కు ఫోన్ చేయడంతో కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కమీషన్ మర్చంట్‌కు మోక్షమెప్పుడో?

- 1993లో కమీషన్ మర్చంట్ ఏర్పాటు
- నిర్వీర్యమైనా పట్టించుకోని అధికారులు
- మర్చంట్‌లేక రైతులకు ఇబ్బందులు



శిథిలమైన కమీషన్ మర్చంట్ భవనాలు



అయిజ వ్యవసాయ మార్కెట్ సబ్‌యార్డ్

అయిజ: రైతులు పండించిన పంటను విక్రయించుకోవాలంటే సరైన మార్కెట్ వసతి ఉండాలి. కొనుగోలుదారులు ధాన్యం కొనేందుకు పోటీ పడాలి. అప్పుడే రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర వస్తుంది. ప్రభుత్వం ఆదిశగా అడుగులు వేయడంలేదు. గతంలో ఏర్పాటు చేసిన కమీషన్ మర్చంట్లు కూడా నిర్వీర్యమవుతున్నాయి. కొనుగోలు కేంద్రాల పేరుతో కొన్నిరోజులు రైతుల పంటలు కొనేందుకు ప్రభుత్వం చేస్తున్న ఏర్పాట్లు కంటితుడుపు చర్యగా ఉన్నాయి.

నిర్వీర్యమైనం కమీషన్ మర్చంట్లు..

ప్రభుత్వం 1993లో అయిజ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ సబ్ యార్డులో కమీషన్ మర్చంట్‌ను ఏర్పాటు చేసింది. మూడేళ్ల పాటు ప్రభుత్వం మార్కెట్ యార్డ్‌పై దృష్టిసారించింది. అనంతరం మౌలిక వసతులు కల్పించకపోవడంతో అప్పట్లో అటు వ్యాపారులకు, ఇటు రైతులకు ఎన్నో సమస్యలు ఎదురయ్యాయి. దాంతో అయిజ మార్కెట్ సబ్ యార్డ్‌కు రైతులు పంటలు తీసుకరావడం తగ్గించారు. కమీషన్ మర్చంట్ ద్వారా ఆదాయం తక్కువ కావడంతో ప్రభుత్వం మార్కెట్ యార్డ్ నిర్వహణను గాలికొదిలేసింది. మర్చంట్ నిర్వాహకులు 2000 సంవత్సరం వరకు ఎలాగోలా కమీషన్ మర్చంట్‌ను నిర్వహించారు. అనంతరం కమీషన్ మర్చంట్ వారికి ఇబ్బందులు ఎక్కువ కావడంతో వారు కూడా చేతులెత్తేశారు. అప్పటి నుంచి అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. నిర్వాహణ లేకపోవడంతో కమీషన్ మర్చంట్ భవన సముదాయాలు శిథిలమయ్యాయి.

వ్యవసాయంపైనే ఆధారం..

అయిజ పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల రైతులు వ్యవసాయంపైనే ఎక్కువగా ఆధారపడ్డారు. మండలంలో మొత్తం 68,673 ఎకరాల వ్యవసాయభూమి ఉంది. ఆర్డీఎస్ కాల్వకు సాగునీరు విడుదలైన ప్రతి సారి వానకాలంలో ఆర్డీఎస్ ఆయకట్టులో సుమారు 7వేల ఎకరాలు వరి సాగు చేస్తున్నారు. ఈ ఏడాది ఆర్డీఎస్ ఆయకట్టు రైతులు ఎక్కువగా వరిసాగు చేశారు. ఇతర ప్రాంతాల్లో ఆరుతడి పంటలుగా పత్తి, మిరప, ఆముదం, కంది, కూరగాయలు సాగు చేసేశారు. అదేవిధంగా యాసంగిలో పప్పుశనగ, వాము, జొన్న, మొక్కజొన్న తదితర పంటలు సాగుచేశారు. అయిజ వ్యవసాయ మార్కెట్ సబ్‌యార్డ్‌లో కమీషన్ మర్చంట్ లేక పోవడంతో పండించిన పంటలను అమ్ముకోవడానికి అన్నదాతలు అనేక అవస్థలకు గురవుతున్నారు.

రవాణా ఖర్చులు ఎక్కువ..

పండించిన పంటలను అమ్ముకునేందుకు రైతులకు రవాణా ఖర్చులు తడిసి మోపడవుతున్నాయి. సుదూర ప్రాంతాల్లో ఉన్న కర్ణాటక రాష్ట్రంలోని రాయచూరుకు, గద్వాల జిల్లా కేంద్రానికి ధాన్యాన్ని, పత్తి, మిరప, వాము తదితర పంటలను తరలించడానికి అన్నదాతలకు అనేక సమస్యలు ఎదురవుతున్నాయి.

కంటితుడుపు చర్యలు..

రైతులు పండించిన పంటలను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం రైతులకు కంటితుడుపు చర్యగా కొంతకాలం పాటు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుంది. వానాకాలంలో వరి, కంది, మొక్కజొన్న పంటలతోపాటు యాసంగిలో పండించిన పప్పుశనగ పంటలు మాత్రమే కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తుంది. కొనుగోలు చేసిన పంటలకు వెంటనే డబ్బు చెల్లించకుండా కొన్ని రోజుల పాటు కాలయాపన చేస్తోంది. దీంతో రైతులు కొనుగోలు కేంద్రాలకు పంటను తీసుకొచ్చేందుకు ఆసక్తి చూపడంలేదు. ఇతర పంటలను విక్రయించుకునేందుకు కొనుగోలు కేంద్రాల్లో అవకాశం లేకపోవడంతో సుదూర ప్రాంతాలకు తరలించాల్సి వస్తుంది.

కమీషన్ మర్చంట్ ఏర్పాటుకు కృషి చేస్తాం



రైతులకోసం గతంలో ఏర్పాటు చేసిన అయిజ మార్కెట్ సబ్ యార్డ్‌లో కమీషన్ మర్చంట్ అనేక కారణాలవల్ల నిర్వీర్యమైంది. మార్కెట్ సబ్ యార్డ్‌లో షెడ్ ఉంది. కావలసినంత స్థలం ఉంది. ప్రభుత్వం మూడు గోదాంలు నిర్మించింది. కమీషన్ మర్చంట్‌ను తిరిగి ప్రారంభించడానికి సుముకంగా ఉన్నాం. కమీషన్ మర్చంట్ నిర్వాహకులు ముందుకొచ్చి దరఖాస్తులు చేసుకుంటే మేము అనుమతులిస్తాం. నిర్వహనకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేస్తాం.

– పుష్పమ్మ, జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్

అన్నదాతలు అవస్థలు పడుతున్నారు



అయిజ వ్యవసాయ మార్కెట్ సబ్ యార్డులో కమీషన్ మర్చంట్ లేకపోవడంతో రైతులు పండించిన పంటలను అమ్ముకోవడానికి అనేక అవస్థలు పడుతున్నారు. ధాన్యం, పత్తి, మిరప, వాము తదితర పంటలను ఇతర మార్కెట్ యార్డులకు తరలించేందుకు అదనపు ఖర్చు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్ సబ్‌యార్డ్‌లో కమీషన్ మర్చంట్‌ను ఏర్పాటు చేస్తే రైతులకు ఊరట కలుగుతుంది.

– లింగన్న, రైతు, అయిజ

ఇబ్బందులకు గురవుతున్నాం



అయిజలో కమీషన్ మర్చంట్ లేకపోవడంతో రైతులం అనేక ఇబ్బందులకు గురవుతున్నాం. పండించిన ధాన్యం అమ్ముకోవడానికి ఎక్కడెక్కడికో పోవల్సి వస్తోంది. ప్రభుత్వం కమీషన్ మర్చంట్ ఏర్పాటు చేస్తే రైతులకు ఉపయోగంగా ఉంటుంది.

– గోవిందు, రైతు, అయిజ

దళారులు దోచుకుంటున్నారు



మండలంలోని వ్యవసాయ మార్కెట్ సబ్‌యార్డ్‌లో కమీషన్ మర్చంట్ లేక పోవడంతో దళారులు రైతులను దోచుకునే అవకాశముంది. గత్యంతరం లేని పరిస్థితుల్లో అన్నదాతలు దళారులకు ధాన్యాన్ని అమ్ముకుంటున్నారు. ఇదే అవకాశంగా చేసుకొని కొంత మంది దళారులు రైతులను మోసంచేస్తున్నారు. కమీషన్ మర్చంట్ ఏర్పాటు చేసి రైతుల సమస్యలు పరిష్కరించాలి.

– మేకల నాగిరెడ్డి, రైతు సంఘం మండల అధ్యక్షుడు

14న అలంపూర్ జోగులాంబ జాతర

జోగులాంబ శక్తిపీఠం/ అలంపూర్ రూరల్: జోగులాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 14న అలంపూర్‌లో జోగులాంబ జాతరను విజయవంతం చేసేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని జోగులాంబ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బండి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. తెలంగాణ అతిథి గృహంలో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ఏకైక శక్తి పీఠం అలంపూర్ జోగులాంబ దేవి అమ్మవారి ఆలయంలో 19వ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గుర్తు చేశారు. తుంగభద్రనది తీరాన కోట దగ్గర వెలసిన జోగులాంబ తల్లికి సేవ సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సేవ సమితి ప్రధాన కార్యదర్శి దిండిగల్ల ఆనంద్ శర్మ, ప్రధాన బాధ్యులు, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ జితేందర్ గౌడ్ ఉన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

కేటీదొడ్డి: యుక్త వయస్సు రాకుండా ఆడపిల్లలకు వివాహాలు చేయడం చట్ట విరుద్ధమని సీఆర్‌పీఎఫ్ సభ్యులు జయరామ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో బాలల హక్కుల సంరక్షణ వేదిక (సీఆర్‌పీఎఫ్) ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. బాల్య వివాహాలు, బడిబయటి పిల్లలు, ఆటో కూలి వెళ్లే పిల్లలపై అవగాహన కల్పించారు. అనంతరం వద్దు పెళ్లి, బడికి పోతాం మేం అనే వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 21 సంవత్సరాలు దాటిన తర్వాతనే వివాహాలు చేయాలని, బాల్య వివాహాలు చట్టరిత్యా నేరమని, ఎవరైనా బాల్య వివాహాలు చేస్తే వారి తల్లి దండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో తల్లుల కమిటీ అధ్యక్షురాలు సవిత, నాయకులు విష్ణు, వీరన్న, సీఆర్‌పీఎఫ్ కమిటీ సభ్యులు ఉన్నారు.

ఎస్ఐని సన్మానించిన నాయకులు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల నూతన ఎస్ఐ వెంకటేష్‌ను సోమవారం పలువురు నాయకులు పీఎస్‌లో కలిసి పూల మాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. నాయకులు కృష్ణసాగర్, రాజేష్, జమ్మన్న, రాజు, పరిపూర్ణం, సుధాకర్ ఉన్నారు.

పాఠశాల సమస్యలపై పోస్టు కార్డులు



విద్యార్థుల ద్వారా సీఎంకు రాసిన పోస్టుకార్డులు

గట్టు: ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులతో సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టుకార్డులను రాసి పంపారు. పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు హలీంపాషా గట్టు ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సరిపడ మూత్ర శాలలు లేక ఇబ్బంది పడుతున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్న భోజనం కూడా మెనూ ప్రకారం విద్యార్థులకు అందించడం లేదన్నారు. తరగతి గదులతో పాటుగా పాఠశాల ఆవరణ చెత్తాచెదారంతో నిండిపోయినట్లు తెలిపారు. పాఠశాల ఆవరణలో చేపట్టిన నూతన భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ నాయకులు అహ్మద్, ధనుంజయ్, వికాస్, అనిల్‌కుమార్, రాము పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో గురుకుల ఉద్యోగుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న గురుకుల ఉద్యోగులు

ఎర్రవల్లిచౌరస్తా: గురుకులాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇటిక్యాల సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో ఉద్యోగులు భోజన విరామ సమయంలో కళాశాల గేటు ముందు ఎండలో నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. ప్రమోషన్లతో పాటుగా బదిలీలను వెంటే చేపట్టి.. ముక్త కంఠంతో తమ సమస్యలను సానుభూతితో ఆలోచించే దిశగా ప్రభుత్వం అగుడుల వేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఉద్యోగులు శ్రీనివాస్, గిరిదర్, సతీష్, రమేష్, సురేష్, భాస్కర్, వీరబ్రహ్మం ఉన్నారు.

మాజీ సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

అయిజ: మండల కేంద్రంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర పీసీసీ అధికార ప్రతినిధి శ్రీక్షావలి ఆచారి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజాపాలనను జీర్ణించుకోలేని మాజీ సీఎం కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేసినందుకు నిరసనగా కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేసినట్లు తెలిపారు.



మాజీ సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

క్రీడాకారులకు ప్రోత్సాహం

తిక్క వీరేశ్వర స్వామి ఆలయం సమీపంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నీని జెడ్పీ చైర్ పర్సన్ సరిత, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా వారిని కాంగ్రెస్ కార్యకర్తలు గజమాలతో సత్కరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం క్రీడాకారులను విస్మరించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తోందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సోమశేఖర్‌రెడ్డి, సీతారామిరెడ్డి, మద్దిలేటి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కారుపాకులలో భగవద్గీతపై అవగాహన

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని కారుపాకులలో త్రైతసిద్ధాంతం, ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో సోమవారం భగవద్గీతపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రబోధ సేవాసమితి ఎర్రవల్లి కమిటీ సభ్యులు గ్రామంలోని ఇటింటికి తిరిగి భగవద్గీతపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలోని ప్రజలకు భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేశారు.

పంటకు రక్షణగా సౌండ్, లైటింగ్..



పంటకు రక్షణగా రాత్రి సయమంలో ఏర్పాటు చేసిన లైట్లు



పంట మధ్యలో ఏర్పాటు చేసిన రికార్డింగ్ స్పీకర్లు

విత్తనాలు భూమిలో వేసినప్పటి నుంచి పంట చేతికొచ్చే వరకు రైతులు కంటికి రెప్పలా కాపాడుకోవాలి. జిల్లా కేంద్రానికి చెందిన రైతు మహిబూబ్ గద్వాల శివారులో పల్లి (వేరుశెనగ) పంట వేశాడు. పంటను అడవి పందులు, పక్షుల నుంచి రక్షించేందుకు వినూత్నంగా ఆలోచించి చార్జింగ్ స్పీకర్లు కొనుగోలు చేసి అందులో పక్షులు, ఇతర జీవులు బయపడేలా శబ్దాలు రికార్డు చేసి పొలంలో అమర్చాడు. వాటి నుంచి 'ఉష్.. ఛూ.. అరె.. అరె.. భౌ.. భౌ' అంటూ శబ్దాలు వస్తాయి. రాత్రి సమయాల్లో ప్రత్యేకంగా లైటింగ్ ఏర్పాటు చేసి అమర్చడంతో పక్షులు, అడవి పందులు అటువైపు రాకుండా చేశాడు. ఈ దృశ్యాలు సోమవారం 'సాక్షి' కెమెరాకు చిక్కాయి.

– గద్వాల అర్బన్

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం



రాజోళి: బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ, కార్మికుల, ఉద్యోగుల కడుపు కొడుతుందని, ఇప్పటికైనా వైఖరి మార్చుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎ.వెంకటస్వామి అన్నారు. రాజోళిలో లక్ష్మన్న ఆధ్వర్యంలో జరిగిన జనరల్ బాడీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఉద్యోగుల, కార్మికుల, రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని, కార్మిక చట్టాల రద్దును ఉపసంహరించుకోవాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26వేలుగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, ఈ నెల 16వ తేదీన జాతీయ సమ్మెను చేస్తున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సమ్మెలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు విజయ్ కుమార్, లక్ష్మీ, జ్యోతి, శ్రీదేవి, రామకృష్ణ, జయన్న, తిక్కన్న, వహీద్ భాషా తదిదరులు పాల్గొన్నారు.

దేవాలయ అభివృద్ధికి విరాళం

అయిజ: మండలంలోని బింగుదొడ్డిలో నిర్మించిన కాశీ విశ్వనాథ స్వామి ఆలయం అభివృద్ధికి, ప్రహరీ నిర్మాణానికి బీఆర్ఎస్ నాయకుడు రాముడు రూ. 50 వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో చిన్న రాముడు, కిష్టన్న, నాగేష్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



అలంపూర్ రూరల్: ఫిబ్రవరి 11న జరిగిన 3వ అంతర్జాతీయ కరాటే పోటీలలో అలంపూర్ జెడ్పీహెచ్ఎస్ (హరిజనవాడ) పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్, 5 కాంస్య పతకాలను సాధించినట్లు పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం గంటిపోగు నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయురాలు శైలజను, విద్యార్థులను ఉపాధ్యాయ బృందం అభినందించారు. వారిని ఇన్‌చార్జి హెచ్ఎమ్ నాగరాజు అభినందించారు.

మార్కండేయ స్వామి జయంతి మహోత్సవాలు

గద్వాల: భక్త మార్కండేయ స్వామి జయంతి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సోమవారం గద్వాల పద్మశాలీ సంఘం, పద్మశాలీ యువజన సంఘం ఆధ్వర్యంలో వేడుకలను వైభవంగా చేపట్టారు. ఆలయంలో ఉదయం ఏడు గంటల నుంచే పూజ కార్యక్రమాలు మొదలయ్యాయి. అనంతరం పద్మశాలీ సంఘం నాయకులు భక్త మార్కండేయ స్వామి రథోత్సవాన్ని పట్టణ పురవీధుల గుండా చేపట్టారు. రథోత్సవంలో మహిళలు కోలాటాలు ఆడుతూ, భక్తి గీతాలు ఆలపిస్తూ ముందుకు సాగారు. భజనలతో హోరెత్తించారు. ఆలయంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

గద్వాల అర్బన్: కార్మికులకు కనీసం వేతనం రూ.26వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పేరు నర్సింహ అన్నారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు మద్దతుగా సోమవారం జిల్లా కేంద్రంలోని పలు వార్డులో కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా 16న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని కార్మికవర్గం తమ ఐక్యతను చాటాలని, కనీస వేతనాల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. నాయకులు వెంకటేష్, శివ, నరేష్, హనుమంతు, రాముడు తదితరులు ఉన్నారు.



కరపత్రాలను పంపిణీ చేసి, ప్రచారం నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



కొత్తపల్లి పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్క నాటుతున్న ఎంపీపీ

గట్టు: మొక్కల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా స్వీకరించాలని, విద్యార్థులు ప్రతి ఏటా పైతరగతికి ప్రమోట్ అయిన సందర్భంగా మొక్కను నాటాలని ఎంపీపీ విజయ్‌కుమార్ కోరారు. సోమవారం కొత్తపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. రాజమండ్రి నుంచి ప్రత్యేకంగా తెప్పించిన మొక్కలను గ్రామస్తులు, విద్యార్థులతో కలిసి ఎంపీపీ విజయ్‌కుమార్ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి పాఠశాల ఆవరణలో నాటిన మొక్కలను సంరక్షించుకోవాలని ఎంపీపీ సూచించారు.

సంక్షేమ పథకాలకు కేంద్రం నిధులు

గట్టు: సంక్షేమ పథకాలకు కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం నిధులను కేటాయిస్తున్నట్లు బీజేపీ నాయకులు సురేష్, నాగప్ప, నర్సింహులు తెలిపారు. సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో గావ్ చలో కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా సురేష్, నాగప్ప, నర్సింహులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకానికి నిధులను కేటాయిస్తున్నట్లు తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించే విధంగా క్షేత్ర స్థాయిలో కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాచర్ల రమేష్, సురేష్, బెల్లం నర్సింహులు, గట్టు నర్సింహులుగౌడు, బద్దూర్‌రెడ్డి, సల్కాపురం నర్సింహులు పాల్గొన్నారు.



కర పత్రాలను అందజేస్తున్న బీజేపీ నాయకులు

కుష్ఠువ్యాధిపై అవగాహన

అలంపూర్ రూరల్: మండలంలోని క్యాతూర్ పీహెచ్‌సీ పరిధిలో సోమవారం జెడ్పీహెచ్ఎస్ న్యూ ప్లాట్స్ పాఠశాలలో కుష్ఠు వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గాంధీజీ వర్ధంతి సందర్భంగా జనవరి 30 నుంచి ఫిబ్రవరి 12 వరకు కుష్ఠువ్యాధిపై అవగాహన కల్పించారు. అందులో భాగంగా సోమవారం క్యాతూర్ పీహెచ్‌సీ పరిధిలోని జెడ్పీహెచ్ఎస్ లింగన్‌వాయి, అలంపూర్ న్యూ ప్లాట్స్, భైరాపురం పాఠశాలలో కుష్ఠువ్యాధిపై అవగాహన కల్పిస్తూ ప్రతిజ్ఞ చేయించారు. అదే విధంగా పాత కేసులు ఉట్కూర్ కు చెందిన బజారన్న, తక్కశిలకు చెందిన కృష్ణయ్యలకు వైద్యాధికారిణి డాక్టర్ ప్రసూన రాణి జిల్లా పారామెడికల్ అధి కారి మల్లికార్జున్‌లు దుప్పట్లు పంపిణీ చేశారు. కా ర్యక్రమంలో సీహెచ్ఓ లక్ష్మీకాంత్, సూపర్‌వైజర్ అ క్కమ్మ, లెప్రసీ నోడల్ పర్సన్ బాలీశ్వరయ్య ఉన్నారు.

ఆరోగ్య మహిళా కార్యక్రమం ఉపయోగించుకోండి

మానవపాడు: మండలంలోని పెద్ద పోతులపాడు సబ్‌సెంటర్ పరిధిలోగల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు గర్భిణులకు 18 మందికి మంగళవారం ఆరోగ్య మహిళా కార్యక్రమం డాక్టర్ రిజ్వానా తానివ్వర్ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించారు. ఐరన్ మాత్రలు, పౌష్టికాహారం తీసుకోవడం వల్ల తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో నార్మల్ కాన్పులను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సంధ్యారాణి, చంద్రన్న, శారద, చిట్టెమ్మ, కుమారి పాల్గొన్నారు.

ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

అయిజ: మండలంలోని ఉత్తనూరులో ధన్వంతరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా అర్చకులు ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సుప్రభాతసేవ, తోమాల సేవ, బిందెసేవ, పంచామృతాభిషేకం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా విష్ణు సాహస్రనామ పారాయణ ద్వార, తోరణ, ధ్వజ, కుంభ, ఆరాధనలు, శ్రీధ్వన్వంతరీ హోమం, లఘుపూర్ణాహుతి, బలిహరణ, శ్రీవారి కల్యాణ మహోత్సవం, గరుడవాహన సేవ, నివేదన, హారతి కార్యక్రమాలను నిర్వహించారు.

'దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతోంది'

ఎర్రవల్లిచౌరస్తా: దేశ సంపదను కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు దోచిపెడుతుందని ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి ఆశన్న అన్నారు. సోమవారం ఇటిక్యాల మండలంలోని పొగాకు కంపెనీలో ఏఐటీయూసీ హమాలీ కార్మికులతో కలిసి ఈ నెల 16న చేపట్టనున్న జాతీయ సమ్మె వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చి పదేళ్లు కావస్తున్నా కార్మికులు, రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. 16న చేపట్టే సార్వత్రిక సమ్మెకు కార్మికులు, రైతులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో హమాలీ సంఘం నాయకులు పరశురాముడు, నాగరాజు, వెంకటేష్, కిష్టన్న, గోవిందు ఉన్నారు.